క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జీవీకేకే వర్మ, దాతలు

పద్మనాభం: మండలంలోని గంధవరం దిగువ వీధిలో గ్రామ ప్రజలు, అనందపురం మండలం శొంఠ్యాం గ్రామానికి చెందిన పసుమర్తి వెంకట బంగారు శెట్టి కుమారులు పసుమర్తి వెంకట నాగేశ్వర గుప్త, పసుమర్తి అప్పలరాజు గుప్త విరాళాలతో రామాలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.వి.కె.వర్మ, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పల్లి గోవింద, నెలివాడ స్వామినాయుడు, నెలివాడ రమణ పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ అర్చకులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు.

పాఠశాలకు కిటికీల ఏర్పాటు

కొమ్మాది: సాగర్‌నగర్ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలకు అధునాతన వసతుల కల్పనలో భాగంగా డివీస్ లేబొరేటరీ సహకారంతో ప్రధాన ద్వారం, 15 కొత్త కిటికీలు ఏర్పాటు చేశారు. వీటిని పాఠశాల ప్రిన్సిపాల్ ఎమ్. మహేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు.

రూ.18.48 కోట్లతో మండల బడ్జెట్

పద్మనాభం: ఎంపీటీసీ సభ్యులకు కేటాయించిన నిధులను వారి అనుమతితోనే మంజూరు చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు తమ సెగ్మెంటులో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల అంచనా బడ్జెట్‌ను 2023 - 2024 సంవత్సరానికి 18.48 కోట్లతో రూపొందించారు. బడ్జెట్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రాధ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, ఏఈ లలిత

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి శాంతినికేతన్ నుంచి పద్మనాభం కన్నయ్య కోనేరు వరకు రూ.10.04 కోట్లతో విస్తరిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు శుక్రవారం పరిశీలించారు. రెడ్డిపల్లి గ్రామంలో వీరు పనుల తీరును గమనించారు. 3.55 కిలో మీటర్ల నిడివి గల ఈ రోడ్డు 20 అడుగుల వెడల్పు ఉంది. దీన్ని మరో 20 అడుగుల మేర విస్తరించి 40 అడుగుల రోడ్డుగా నిర్మించనున్నారు. పనుల ప్రగతిని ఆర్‌అండ్‌బీ ఏఈ లలిత వివరించారు.

ఆధునిక వైద్యంతో క్షయ నియంత్రణ

తగరపువలస: క్షయ వ్యాధి నియంత్రణకు ముఖ్యమైన పౌష్టికాహారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద ద్వారా అందిస్తున్నామని భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ అమిత్ ప్రధాన్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ కనక వ్యాధి లక్షణాలు, నివారణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే హెల్త్‌సెంటర్‌లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఉపాధ్యాయుడు టి.ఎస్.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

- బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వాలు అధునాతన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయని పేర్కొన్నారు.



గంభీరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో క్షయ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎంసీఆర్ చెప్పుల పంపిణీ

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో శుక్రవారం లెప్రసీ సొసైటీ సమకూర్చిన ఎంసీఆర్ చెప్పులు కుష్టు వ్యాధి, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు 43 మందికి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీచ్ మీ సంస్థ డీసీవో వి.గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొమ్మాది: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రమాదకర వ్యాధుల్లో క్షయ ఒకటని, దీని కారణంగా ఏటా 1.6 మిలియన్ల జనాభా మరణిస్తున్నారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 సంవత్సరం నాటికి పూర్తిగా క్షయను అరికట్టాలన్న లక్ష్యంతో ప్రపంచ దేశాలకు దిశ నిర్దేశం చేసిందని తెలిపారు.

దగ్గు ఎక్కువుగా ఉంటే పరీక్షలు తప్పనిసరి

ఆనందపురం : రెండు వారాల కంటే ఎక్కువగా దగ్గు ఉంటే తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ సూచించారు. మండలంలోని గంభీరంలో శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలనలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దగ్గు ఎక్కువ రోజులు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించి కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆశా కార్యకర్తలు ద్వారా ఉచితంగానే మందులు అందజేస్తామని చెప్పారు. గండిగుండంలో వైద్యురాలు ప్రవల్లిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి క్షయ వ్యాధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి, సీహెచ్‌వో సాయి గౌతమి పాల్గొన్నారు.



ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేస్తున్న ఆదినారాయణ



ర్యాలీ నిర్వహిస్తున్న గీతం కళాశాల విద్యార్థులు

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 20 మంది ఎంపిక

తగరపువలస: జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలో చిట్టివలస ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ఉచితంగా శిక్షణ పొందిన 20 మంది ఎంపికయ్యారు.

వీరికి అయిదు మాసాలపాటు నిర్వాహకులు చిట్టివలస హైస్కూల్‌లో శిక్షణ ఇచ్చారు. 8వ తరగతి చదువుతున్న వారికి అర్హతగా నిర్వహించిన ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వారికి నాలుగేళ్లపాటు రూ.12వేలు వంతున ప్రభుత్వం అందిస్తుంది. ఎంపికైన విద్యార్థులను సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు దత్తి ఈశ్వరరావు, రేఖ అప్పారావు, పొట్నూరు మురళీమోహన్‌రావు, అధ్యాపక బృందం పక్కి నాగేశ్వరరావు, వీటీ విజయకుమార్, ఆనంద్, చిన్నారావు, వైవీ రమణ, దత్తి రవి, ఏఎల్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు వీరే

చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ నుంచి ఎం.వర్షిణి (జిల్లా స్థాయి 4వ ర్యాంకు), బి.ఒలీవ, పి.లావణ్య, పి.సంజన, ఎస్.స్వాప్నిక, జె.సాయిప్రీతి, బాలుర హైస్కూల్ నుంచి జె.కీర్తన్, ఎస్.షణ్ముఖ్, కె.హరికోమల, కె.రితీష్, ఎం.లోహిత్‌కుమార్, కె.రఘువర్మ, భీమిలి సెయింటాన్స్ నుంచి ఎం.భవ్య, మజ్జిపేట హైస్కూల్ నుంచి ఎం.హేమ, తాళ్లవలస హైస్కూల్ నుంచి ఆర్.జోషిత, వై.దీక్షిత, సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ నుంచి ఎ.ఈశ్వరి, జె.సాయివర్ధన్, భీమిలి ప్రభుత్వ యూపీ స్కూల్ నుంచి జె.స్నేహిత, భీమిలి ఎంఎల్ 18వ వార్డు నుంచి సీహెచ్.సాయికృష్ణ, రేవిడి హైస్కూల్ నుంచి ఎం.జ్యోత్స్న, వెంకటాపురం యూపీ స్కూల్ నుంచి ఎం.విశాలాక్షి ఎంపికయ్యారు.

రికార్డు స్థాయిలో వేములవలస ఆశీలు వేలం పాట

ఏడాదికి రూ.1.67 కోట్లకు ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆనందపురం : మండల పరిధి వేములవలసలోని మహాత్మా గాంధీ రోజు వారీ మార్కెట్‌లో ఏడాదిపాటు ఆశీలు వసూలు వేలం పాటను శుక్రవారం నిర్వహించగా రికార్డు స్థాయిలో రూ.1.67 కోట్లకు హెచ్చు పాట పాడిన పతివాడ పుష్పలతకు ఖరారైంది. గతేడాది కంటే ప్రస్తుతం రూ.67 లక్షలు అధికం. పంచాయతీ కార్యదర్శి నరసింగరావు ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి జి.అప్పలరాజు అధ్యక్షతన టెండర్, బహిరంగ పద్ధతుల ద్వారా వేలం నిర్వహించారు. మధ్యాహ్నం వరకూ షీల్డ్ టెండర్లను స్వీకరించారు. అనంతరం బహిరంగ వేలం నిర్వహించగా పతివాడ పుష్పలత రూ.1,46,00,000లకు పాడగా కోరాడ రమణ అనే వ్యక్తి ఆమె కంటే హెచ్చుగా రూ.1,47,00,000లకు పాట పాడాడు. అనంతరం మూడు షీల్డ్ టెండర్లను తెరిచారు. అందులో పతివాడ పుష్పలత రూ.1,66,99,999లకు హెచ్చు పాట పాడగా ఆమెకే అధికారులు ఖరారు చేశారు. ఏడాది కాలానికి వేములవలస మార్కెట్‌లో వివిధ వ్యాపారుల నుంచి రోజువారీ ఆశీలు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. కార్యక్రమంలో సర్పంచ్ లంక కొండమ్మ, ఈవోపీఆర్డీ పీపీఎన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

27న శివాలయ వార్షికోత్సవం



కాశీ ఉమామహేశ్వర స్వామి

పీఎం పాలెం: కారుషెడ్ కూడలికి సమీపంలోని శ్రీ బబ్బేలమ్మ సమేత కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 27న ఉదయం 6 గంటల నుంచి స్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృత సహిత సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం, విశేష పూజలు చేస్తామని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పార్వతీ పరమేశ్వరుల తిరువీధి అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 28న మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చిరు ధాన్యాల వినియోగంతో ఆరోగ్యం

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలను వినియోగిస్తే ఆరోగ్యంగా ఉంటారని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ కె.సత్యంనాయుడు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల పక్షోత్సవాల సందర్భంగా మండల సమాఖ్య కార్యాలయం వద్ద పలు పంచాయతీల నుంచి వచ్చిన రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, మహిళ సమాఖ్య సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాల వినియోగం ఎంతో అవసరమని, దీనివల్ల అనారోగ్య సమస్యలు తగ్గుతాయన్నారు. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో కొనుగోలుదారులు పెరిగారన్నారు. గ్రామాల్లో చిరుధాన్యాల పంటలను ఎక్కువగా పండించాలని, మంచి లాభసాటిగా ఉంటుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎఫ్‌పీవో అధ్యక్షురాలు ఎస్.అనసూయ, కార్యదర్శి వై.విజయలక్ష్మి, కోశాధికారి కె.సంతోషలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మండల సమాఖ్య సభ్యులు

శ్రీరామ నవమి ఉత్సవాలకు రాట



ఉత్సవ రాట వేస్తున్న నాయకులు, ధర్మకర్త

మధురవాడ: శ్రీరామ నవమి వేడుకలకు జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ టైలర్స్ కాలనీలో గల శ్రీ విజయదర్గాదేవి ఆలయంలో అంకురార్పణ చేశారు. శుక్రవారం ఆలయంలో అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ధర్మకర్త బంగారు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు ప్రకాశ్ తదితరుల సమక్షంలో నాగేశ్వరరావు, పార్వతి, సూకరాజు, ఉమ తదితరులు ఉడుపు రాట వేశారు. ఈ సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణం, పూజల్లో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



కర్రి రాధకు బీమా సొమ్ము అందిస్తున్న సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ తాతాజీనగర్‌కు చెందిన కర్రి రాధ అనే మహిళకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10వేలు సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు శుక్రవారం అందించారు. పంచాయతీలోని తాతాజీనగర్‌కు చెందిన కర్రి తమ్మినాయుడు ఇటీవల మరణించడంతో మృతుని భార్యకు తక్షణ సాయంగా నగదు అందించారు. గ్రామ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు దుర్గాదేవి, విజయకుమార్, వలంటీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



అనంతుని పుష్కరిణి గట్టుపై కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీపీ రాంబాబు తదితరులు

పద్మనాభం: మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఉన్న అనంత పద్మనాభస్వామి (కన్నయ్య కోనేరు) పుష్కరిణి గట్టుపై శుక్రవారం ఆయన వంద కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, మొకర వినయ్ పాల్గొన్నారు.

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలు నాటి పరిరక్షించాలని వైఎస్సార్‌సీపీ 4వ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి సూచించారు. కాపులుప్పాడ పరిధి పాత పరదేశిపాలెంలో శుక్రవారం మొక్కలు నాటారు. మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఆలీవర్ తదితరులు

తగరపువలస: ఇటీవల వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను భీమిలి కేథరిన్ విద్యాసంస్థల కార్యదర్శి ఆలీవర్ ఆర్ రాయి, డైరెక్టర్ ఇవాంజలిన్ రాయి, ప్రిన్సిపాల్ సౌజన్య శుక్రవారం అభినందించారు. వీరిలో వరల్డ్ లైఫ్ కన్సర్వేషన్ డే సందర్భంగా లోచన (8), జగదీష్(7), క్విజ్‌నీర్ విన్నర్స్‌గా భవ్యశ్రీ(8), లక్షిత(6), నేషనల్ ఉమెన్స్ డే ఎస్సే రైటింగ్ విన్నర్స్‌గా మహమ్మద్ దిల్షాద్(10), యు.వర్షిణి(10) నిలిచారు. వీరిని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సంపద తయారీ కేంద్రాలతో ప్రయోజనాలు

- శిక్షణలో సీఈవో శ్రీరామమూర్తి, డీఈవో అప్పలరాజు



క్లాప్ మిత్రలకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

ఆనందపురం : పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి చక్కగా నిర్వహించాలని సీఈవో పి.శ్రీరామమూర్తి, డీపీవో జి.అప్పలరాజు సూచించారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, క్లాప్ మిత్రలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులకు మండలంలోని వేములవలస, వెల్లంకి పంచాయతీల్లో గల సంపద తయారీ కేంద్రాల వద్ద శుక్రవారం రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆనందపురం మండలాన్ని మోడల్ మండలంగా అధికారులు ఎంపిక చేయడంతో ఇక్కడ శిక్షణ ఏర్పాటు చేశామని వివరించారు. గ్రామాల్లో గల తడి, పొడి చెత్తను క్లాప్ మిత్రలు ద్వారా ఇంటింటికీ వెళ్లి సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారన్నారు. అక్కడ తడి, పొడి చెత్తను వేర్వేరు కుండీల్లో వేసి పేడ, ఇతర వ్యర్థాలు, వానపాములను వినియోగించి ఎరువులు తయారు చేస్తారని వివరించారు. దీని వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతోపాటు ఎరువులు విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని వివరించారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులకు అవగాహన కలిగించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి క్లాప్ మిత్రలకు అందించేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. పొడి చెత్తతో వచ్చే ఇనుము, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను వేములవలస కేంద్రం వద్ద నిల్వ చేయడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ, వేరు చేసే విధానంపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఆనందపురం, పెందుర్తి ఎంపీడీవోలు లవరాజు, వెంకటరావు, ఈవోపీఆర్డీలు ఆంజనేయులు, అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన



చేపట్టిన పనుల వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఆనందపురం : మండలంలోని కణమాంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించి మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆడిట్ కంట్రోలర్ జనరల్ ఎం.రేణుక, ఆడిట్ కన్సల్టెంట్ బాటియా పర్యటించారు. 2018 నుంచి 2021 వరకూ చేపట్టిన వివిధ పనుల్లో 14 పనులను ఎంపిక చేశారు. అందులో క్షేత్ర స్థాయిలో రెండు పనులను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల పనిని, కొండలపై తవ్విన కందకాలను పరిశీలించారు. ఈ మేరకు పథకం క్షేత్ర స్థాయి సిబ్బంది, మేట్‌లతో సమావేశమై రికార్డులను పరిశీలించారు. పనుల అమలు తీరుని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందం వెంట ఎంపీడీవో అడపా లవరాజు, ఈవోపీఆర్డీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

తుపాన్ షెల్టర్ తొలగించాలని వినతి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ప్రమాదకరంగా ఉన్న తుపాన్ షెల్టర్‌ను తొలగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరమణ తదితరులు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రాధకు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. తుపాను షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ షెల్టర్ పక్కనే బోరు బావి ఉండడంతో ప్రజలు తాగు నీరు పట్టుకుంటారని, ఆ సమయంలో కూలిపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు పి.కృష్ణారావు, హెచ్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ మారికవలస ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మధురవాడ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.సంతోష్ కుమార్ చెప్పారు. మారికవలస జంక్షన్, గ్రామం, టయోటా షోరూం, బిస్లరీ వాటర్ కంపెనీ, బోరవానిపాలెం, మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం రాజీవ్ గృహకల్ప కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ డంపింగ్ యార్డు, డ్రైవర్స్ కాలనీ, జేకే లే అవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు సహకరించాలని సంతోష్ కుమార్ కోరారు.

వడివడిగా సముద్రం వైపు...



పెదనాగమయ్యపాలెం తీరంలో తాబేలు పిల్లలు



తాబేళ్లను ఉంచిన బుట్టలతో మత్స్యకారులు

పెదనాగమయ్యపాలెం వద్ద సముద్రంలోకి 640 తాబేలు పిల్లలు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం తీరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షించిన తాబేలు గుడ్లు పిల్లలుగా మారడంతో శుక్రవారం ఉదయం పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం మత్స్యకారులు, పంచాయితీ పెద్దల ఆధ్వర్యంలో సముద్రంలోకి వదిలారు. సముద్రఘోష వినిపించిన వైపు తాబేలు పిల్లలు వడివడిగా సాగిపోయాయి. స్థానిక మత్స్యశాఖ ప్రతినిధులు తోట మునలయ్య, గరికిన లక్ష్మణ, దూడ ధనంకొండ తదితరులు మాట్లాడుతూ తీరంలో తాబేళ్ల గుడ్లు పెట్టిన తర్వాత మత్స్యకారులు ఇసుకలో అడుగున్నర లోతు తవ్వి సేకరిస్తారన్నారు. ప్రత్యేకంగా వెదురు కర్రలతో తడికెలు నిర్మించి వాటిని భద్రపరుస్తారన్నారు. దీనివల్ల పక్షులు, ఇతర జంతువుల బారినపడకుండా ఉంటాయన్నారు. శుక్రవారం 640 తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్టు వారు తెలిపారు. ఇంకా మరిన్ని గుడ్లు తీరంలో ఉన్నాయని, అవి పిల్లలుగా మారిన తర్వాత తీరంలో విడిచిపెడతామని తెలిపారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు జీపీఎస్ వ్యవస్థ తప్పనిసరి

అల్లిపురం: ట్రాన్స్‌పోర్టు లారీలన్నింటిలో తప్పనిసరిగా జీపీఎస్ వ్యవస్థ అమర్చాలని, లోడింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం చేరేంత వరకు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్టు వారు సదరు లారీల ట్రాకింగ్ డేటా భద్రపరచాలని జోన్-2, డీసీపీ కె. ఆనందరెడ్డి కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లారీ ట్రాన్స్‌పోర్టు సంఘాల యాజమాన్యాలతో, స్టీవ్ డోరింగ్ కంపెనీల ప్రతినిధులతో పోర్టుట్రస్ట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టుట్రస్ట్ కేటాయించిన యార్డుల్లో సంబంధిత సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కంపెనీ యాజమాన్యాలు సూపర్‌వైజర్లను, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే క్రమంలో ఆయా సంస్థలు గత చరిత్ర, నేరచరిత్రను తప్పక పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టీవ్ డోర్స్ కంపెనీ వారు జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలని కోరారు. పోర్టులో షిప్ నుంచి లోడ్ అన్‌లోడ్ చేసిన మెటీరియల్ యార్డ్‌కు పంపించే సమయంలో ప్రతి లారీకి రశీదు అందించి అన్‌లోడ్ అయిందా లేదా అని తనిఖీ చేసుకోవాలన్నారు. వేయింగ్ బ్రిడ్జి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని యజమానులకు తెలిపారు. ఈ సమావేశంలో హార్బర్ ఏసీపీ, హార్బర్ సీఐ, పోర్టుట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్గొన్నారు.